క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. అర్చకులు కమలేష్‌శర్మ, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



దర్శనానికి క్యూలో భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా,సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి అమ్మవార్లకు శనివారం సందర్భంగా భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీ శర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు నిత్య పూజలు గావించి ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తాదులు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

చాగలమర్రి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వీపర్‌గా, ఇన్‌చార్జ్ మేస్త్రీగా పనిచేస్తున్న 5వ సచివాలయ పరిధిలోని హుసేన్‌బాషా కాలనీలో నివాసం ఉంటున్న మట్టా తిమ్మయ్య (33) ఇటీవల మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను మృతుడి కుటుంబ సభ్యులకు సర్పంచ్ తులసమ్మ, ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి శనివారం అందజేశారు. వారు మాట్లాడుతూ మిగిలిన మొత్తం నామినీ ఖాతాలో జమవుతుందని చెప్పారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులు

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ కాశిరెడ్డినాయన విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ముందుగా భక్తిశ్రద్ధలతో వివిధ హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం భక్తుల సమక్షంలో చేపట్టారు.మూడురోజులుగా కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలకు వచ్చిన భక్తులకు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు గోపవరం కాశీ విశ్వానాథ్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోండి



ఎర్రగుడిదిన్నెలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రుద్రవరం: రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని శిరివెళ్ల సీఐ చంద్రబాబు, రుద్రవరం ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు, చందలూరు, ఆలమూరు, నర్సాపురం గ్రామాల్లో శనివారం వారు పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు.అనంతరం ఆయా గ్రామాల రచ్చబండల వద్ద ప్రజలకు పలు సూచనలు చేశారు.

గ్లకోమా అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాల టౌన్: గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా నంద్యాల ఐఎంఏ, నంద్యాల నేత్ర వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం గ్లకోమా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. స్థానిక టౌన్ హాల్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్లకోమా అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా అంధత్వ నివారణ సొసైటీ ప్రభుత్వ నేత్ర వైద్యురాలు డాక్టర్ మాధవీ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ, డాక్టర్లు మాధవి, సహదేవుడు, మధుసూదన్ రెడ్డి, విజయబాబు,మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కల్పన పాల్గొన్నారు.

సార్వత్రిక సమరానికి పార్టీలు సన్నద్ధం

- వైఎస్సార్‌సీపీలో జోష్
- నిరుత్సాహంలో టీడీపీ
- కనిపించని కాంగ్రెస్



ఆళ్లగడ్డ వ్యూ



గంగుల బిజేంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి



భూమా అఖిలప్రియ, టీడీపీ అభ్యర్థి

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో శనివారం సాయంత్రం నుంచే ఎన్నికల నిబంధనలు అమల్లోకి తెచ్చింది. ఈ ప్రకటనతో రాజకీయ పార్టీల్లో మరింత వేడి పుట్టించింది.

మరోసారి పాత ప్రత్యర్థులే..

ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా.. దాదాపు అన్ని సార్లు గంగుల, భూమా కుటుంబాలకు చెందిన వారే సుమారు 45 సంవత్సరాలుగా పోటీ పడుతున్నారు. అయితే ఈ దఫా కూడా ఆ కుటుంబాల నుంచే పోటీ ఉండటంతో పాటు గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీపడిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియలే మరోసారి తలపడుతున్నారు.

ప్రజల్లోకి వెళ్లని టీడీపీ..

వైఎస్సార్‌సీపీ తరపున ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా ఎంపికై పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరిన అఖిలప్రియ మంత్రి కూడా అయ్యారు. మంత్రి అయినా నియోజకవర్గంపై పెద్దగా దృష్టి కేంద్రీకరించక పోవడంతో గత ఎన్నికల్లో భారీ ఓటమి తప్పలేదు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి నియోజకవర్గానికి దూరంగా ఉంటూ సొంత పనులు చక్కబెట్టుకునేందుకే ఎక్కువ సమయం కేటాయించింది. దగ్గరి బంధువులు, ముఖ్య నాయకులు దూరం కావడంతో నైరాశ్యం చెందారు. దీనికి తోడు చివరి వరకు పార్టీ టిక్కెట్ కేటాయిస్తుందో లేదో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఉండటంతో కార్యకర్తలను మరింత నిరుత్సాహానికి గురిచేసింది. ఇటీవల కొన్ని గ్రామాల్లో పర్యటించి ఒకరిద్దరికి పార్టీ కండువా కప్పి మమ అనిపించారు. పూర్తిస్థాయిలో ప్రజలను కనీసం కలవలేదు.

కనుచూపు మేరలో కనిపించని కాంగ్రెస్..

వైఎస్సార్‌సీపీ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోగా టీడీపీ ఇప్పుడిప్పుడే సిద్ధమవుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీ కనుచూపు మేరలో లేదు. జనసేన టిక్కెట్ ఆశించి పార్టీలో చేరారు ఇరిగెల రాంపుల్లారెడ్డి. ఆ పార్టీ టీడీపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ ఇరిగెల మద్దతు తమకు అవసరం లేదని అఖిలప్రియ చెప్పినట్లు సమాచారం. దీంతో ఇరిగెల టీడీపీకి మద్దతు ఇస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

వైఎస్సార్‌సీపీలో జోష్..

ఎన్నికల తేదీలు వెలువడటంతో నియోజకవర్గంలో రాజకీయం మరింత వేడెక్కింది. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికలకు సిద్ధంగా ఉండగా.. ప్రతిపక్ష టీడీపీ ప్రచారంలో పూర్తిగా వెనకబడింది. ఇప్పటికే ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గడపకు తిరిగారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, చేసిన, చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. గతంలో చంద్రబాబు పాలనను ఎత్తి చూపుతూ హామీల అమలును సీఎం వైఎస్ జగన్ పాలనతో పోల్చి వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: నంద్యాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.29.79 లక్షల విలువజేసే చెక్కులను మ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కిందకు రాని వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అడ్డగల్ల మల్లికార్జున, నాయకులు కానాల జగదీశ్వర్ రెడ్డి, కొత్తపల్లె బాల వెంకటరెడ్డి, చింతకుంట్ల భాస్కర్ రెడ్డి, పెద్దకూటల శివ నాగిరెడ్డి దేవనగర్ బాషా, ఆంధ్ర మెడికల్ రమేష్, చాబోలు మహేష్ పాల్గొన్నారు.

జగజ్జననీ ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



కలశాలతో వస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, శాలా ప్రవేశం, కలశ స్థాపన, అభిషేకాలు, మహామంగళ హారతుల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన హోమం, ప్రదోష పూజలు జరిపించారు. పూజల్లో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పుల్లయ్య మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన అమ్మవారికి సహస్ర కలశ క్షీరాభిషేకం, సోమవారం సహస్ర కుంకుమార్చన, మంగళవారం శ్రీచక్రార్చన, బుధవారం చండీ హోమం, పుణ్యాహవాచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బేటీ బచావో-బేటీ పడావో బాలికలకు వరం

చాగలమర్రి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం బాలికలకు వరం లాంటిదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, ప్రిన్సిపాల్ సునీత అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బా, గురుకుల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మరోసారి క్లీన్ స్వీప్ చేస్తాం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



ఎంపీ పోచాను అభినందిస్తున్న హబీబుల్లా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

నంద్యాల: రానున్న సాధారణ ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలిచి క్లీన్‌స్వీప్ చేస్తామని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోచాను ప్రకటించడంతో నూనెపల్లెలోని ఆయన కార్యాలయం వద్ద అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ పోచా మాట్లాడుతూ రెండోసారి పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ నియోజకవర్గంలోని ఏడుగురు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల్లో ముందుకెళ్తామన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏడు స్థానాలతో పాటు ఎంపీ స్థానం గెలిచి క్లీన్ స్వీప్ చేశామని, అదే పునరావృతం చేస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు.

నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగురవేస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శిల్పా రవి

నంద్యాల: నంద్యాల నియోజకవర్గంపై వైఎస్సార్ సీపీ జెండాను మరోసారి ఎగురవేస్తామని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల జాబితాలో నంద్యాల స్థానానికి ఆయన పేరు ప్రకటించడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ జగనన్న చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయాల్లో విశ్వసనీయతను చాటిన నాయకుడిగా జగనన్న మరోసారి చరిత్ర సృష్టిస్తారని చెప్పారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



డబ్ల్యూ కొత్తపల్లెలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దొర్నిపాడు: సాధరణ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్ హెచ్చరించారు. శనివారం మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, డబ్లూ గోవిందిన్నె గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని కోరారు.

ఎండలతో జాగ్రత్త



ఎస్పీకి టోపీలు అందజేస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: ఎండలు మండుతున్న నేపథ్యంలో రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సమక్షంలో సీఐ ఇస్మాయిల్‌కు వేడిని నివారించే పర్సనల్ కిట్‌ను సెవెన్‌హిల్స్ ఆసుపత్రి నిర్వాహకులు మారుతీరావు అందజేశారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నడిగడ్డ ప్రాంతంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన విజయానికి కృషి చేసిన నడిగడ్డ కాలనీ వాసుల రుణం తీర్చుకొనే అవకాశం వచ్చిందని, తనవంతు సహకారంగా శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించానని చెప్పారు. గతంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారన్నారు. 3వేల లీటర్ల సామర్థ్యంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, కౌన్సిలర్లు ఆరీఫ్‌నాయక్, సాదిక్‌బాషా, కలాంబాషా, తబ్రేజ్, కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి వసతి, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను కింద కూర్చోబెట్టకుండా బెంచీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

వసతి గృహాల తనిఖీ



ఆళ్లగడ్డలో బాలుర వసతి గృహం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాశ్

శిరివెళ్ల: రాష్ట్రవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ శనివారం శిరివెళ్ల, ఆళ్లగడ్డలో పర్యటించారు. శిరివెళ్లలో కస్తూర్బా విద్యాలయం, వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మనబడి నాడు-నేడు కింద మంజూరైన 8 అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆళ్లగడ్డలోని బాలుర ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించారు. ఆర్‌జేడీ రాఘవరెడ్డి, డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఎంఈఓలు శంకర్ ప్రసాద్, శోభావివేకవతి ఉన్నారు.

తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటిన పొట్టి శ్రీరాములు



అమరజీవి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, నాయకులు

నంద్యాల(సెంట్రల్): తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశం నలుమూలలా చాటిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి కొనియాడారు. శనివారం పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా స్థానిక సంజీవనగర్ కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టి కార్యక్రమాలను వివరించారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, నెరవాటి రవి, బింగుమళ్ల శ్యాంసుందర్‌గుప్తా పాల్గొన్నారు.

నంద్యాల టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆవోపా అధ్యక్షుడు వీజీకే మూర్తి అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. పెసల శ్రీకాంత్ ఆత్మకూరు సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, ఉమామహేశ్వర్,సాగర్ పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంజీవనగర్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి మహేష్, రాష్ట్ర కార్యదర్శి బింగుమళ్ల శ్యామ్, కండేశ్యామ్‌సుందర్‌లాల్ మాట్లాడుతూ 58రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు కృషి చేశారని కొనియాడారు. నాయకులు, భవనాశి వాసు, సముద్రాల కుమార్, సుబ్బారావు, చంద్రశేఖర్, సుబ్బయ్య, రామకృష్ణ, శివశంకర్, సతీష్, కిరణ్ పాల్గొన్నారు. అలాగే గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. వేణుగోపాల్, నాగేంద్ర, సుబ్బారెడ్డి, రామకృష్ణుడు పాల్గొన్నారు.



నంద్యాల సర్వజన ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్న ఆవోపా నాయకులు



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

పొట్టి శ్రీరాములు జయంతి



చాగలమర్రిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు వంకదార లక్ష్మణ బాబు, శ్రీభారతీ విద్యామందిరం హెచ్ఎం ప్రసాద్.. పొట్టి శ్రీరాములు రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. సంఘం ఉపాధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి సుబ్బారావు, సభ్యులు బచ్చుబాబు, తోటంశెట్టి బాబు, బచ్చురమణ, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల కృషి అభినందనీయం

నంద్యాల(అర్బన్): వీఆర్‌ఓలను రెగ్యులర్ చేయడంలో ఏపీఆర్‌జేసీ నాయకుల కృషి అభినందనీయమని వీఆర్‌ఓలు వేమారెడ్డి, వంశీధర్ తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంలో కృషి చేసిన ఏపీఆర్‌జేసీ రాష్ట్ర నాయకులు రామచంద్రారావు, కామేశ్వరరావు, విజయశేఖర్, నాగరాజును శనివారం స్థానిక నిశాంత్ భవన్‌లో వీఆర్‌ఓలు సన్మానించారు. వీఆర్‌ఓలు మాట్లాడుతూ వీఆర్‌ఏలుగా ఉంటూ 2020లో వీఆర్‌ఓలుగా పదోన్నతులు పొందామని, సర్వే, సీపీటీ పరీక్షలు రాయాల్సి ఉన్నా నిర్వహణ లేకపోవడంతో మూడేళ్లు మామూలు వేతనాలతో ఇబ్బందులు పడ్డామన్నారు. నాయకులు పోరాటాలతో ఉద్యోగాలను క్రమబద్ధీకరించారని చెప్పారు. వీఆర్‌ఓలు పురుషోత్తం, నాగరాజు, మునీశ్వరుడు, అరుణ పాల్గొన్నారు.

ఎన్నికల సమాచారాన్ని మీడియాకు అందజేయండి



ఎన్నికల మీడియా సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సాధారణ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు డీపీఆర్‌ఓ మల్లికార్జునకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల మీడియా సెంటర్, కమాండ్ కంట్రోల్ రూం, ఫిర్యాదు సెల్ తదితర విభాగాలను డీఆర్‌ఓ పద్మజతో కలిసి పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మీడియా సెంటర్‌లో 1952- 2019 వరకు లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు, సమీప ప్రత్యర్థులపై గెలుపొందిన ఓట్ల వివరాలతో సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే నమోదు చేసుకొని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్ఠ అమలుపై మీడియాలో ప్రసారం అవుతున్న అంశాలను నిరంతరం పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ పద్మజను ఆదేశించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి తక్షణ చర్యలను తీసుకోవాలన్నారు. ఎన్నికల విభాగాన్ని పరిశీలించి సిబ్బంది ఏఏ పనులు చేస్తున్నారనే అంశాలపై ఆరాతీశారు.

వరి కోతలు ప్రారంభం



తిమ్మనపల్లె సమీపంలో రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రబీ కింద సాగు చేసిన వరి పంట కోతలు మొదలయ్యాయి. ధాన్యపు దిగుబడులను రైతులు ఆర్‌అండ్‌బీ రోడ్లు, కళ్లాలు,బయలు ప్రదేశాల్లో ఆరబెట్టుకుంటున్నారు. రబీ సీజన్‌లో బోరు ఉన్న రైతులు దాదాపు 3వేల హెక్టార్లలో వివిధ రకాల వరి సాగు చేశారు. పంట కాలం పూర్తి కావడంతో ఇటీవల యంత్రాలతో కోతలు ప్రారంభించారు. ఎకరాకు 30-40 బస్తాల దిగుబడి వస్తోందని, సుగర్ లెస్ రకం బస్తా రూ.2వేల ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం తిప్పారెడ్డిపల్లె, నర్సాపురం, తిమ్మనపల్లె, సుగాలి తండా, చిత్రేనిపల్లె తదితర గ్రామాల పరిధిలో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఎంపీ స్వగ్రామంలో సంబరాలు



ఉయ్యాలవాడలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

ఉయ్యాలవాడ : నంద్యాల పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ప్రకటించడంపై శనివారం ఎంపీ స్వగ్రామం ఉయ్యాలవాడలో పార్టీ కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

నివాళి



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి పుల్లన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పౌరులకు చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జీవన్ రాజు, సుబ్బలక్ష్మి, రామచంద్రుడు, సుధాకర్, జగదీష్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో పాండురంగస్వామి

నంద్యాల(అర్బన్): మండలంలోని పాండురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయ 31వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. స్వామి అమ్మవార్లకు ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మేళనం, సంప్రోక్షణ, అభిషేకాలు, మంగళ హారతి, మంత్రపుష్పం, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణ, ప్రదోష పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.